



- ఉద్యమంలో భాగంగా తండా నిద్ర
- 2010లో భారీ బహిరంగ సభ
- నిధుల సమీకరణ కోసం కూలి పని
- యువతి పెళ్లికి నెక్లెస్ బహూకరణ
- నేడు బీఆర్ఎస్ అధినేత జన్మదినం సందర్భంగా జ్ఞాపకాల సమాహారం

# ప్రజల మనిషి కేసీఆర్

**ఓరుగల్లుతో ఆయనకు విడదీయరాని అనుబంధం**

**తెలంగాణ ఉద్యమంలో భాగంగా ప్రజా నేత కేసీఆర్‌తో ఓరుగల్లు ప్రత్యేక ముద్ర వేసుకున్నది. దీంతో ఉమ్మడి జిల్లాతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఏర్పడింది. ఉద్యమ ఆశయాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగిన ప్రయాణంలో ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదురైనా.. ఎదురుదెబ్బలు తగిలినా తట్టుకొని ఆయన ముందుకు సాగడంలో వరంగల్ కీలక పాత్ర పోషించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని భీమానాయక్ తండాలో కేసీఆర్ నిద్ర చేసి గిరిజనుల స్థితిగతులను తెలుసుకున్నారు. 2010లో వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు కూలి పనిచేశారు. ఈ సందర్భంగా ఓ జ్యువెల్లర్స్‌లో పనిచేసిన ఆయన అక్కడికి వచ్చిన యువతి పెళ్లికి నెక్లెస్ బహూకరించారు. సోమవారం బీఆర్ఎస్ అధినేత జన్మదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని పలు జ్ఞాపకాలపై ప్రత్యేక కథనం..**

**- వరంగల్, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/నెల్లికుదురు**

2010 డిసెంబర్ 16న వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో ఉద్యమ నేత కేసీఆర్ భారీ బహిరంగ సభకు అవసరమైన నిధుల సమీకరణ కోసం కూలీ పని చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని ఓ రైసుమిల్లులో కూలీగా, వరంగల్ నగరంలోని సీపీరెడ్డి కాంప్లెక్స్‌లోని రెడిన్ కలర్ ల్యాబ్ వర్కర్‌గా, చీర్స్ టైలర్స్‌లో టైలర్‌గా, మహమ్మద్ ఖాన్ జ్యువెలర్స్‌లో సేల్స్‌మెన్‌గా పని చేశారు. ఈ క్రమంలో జ్యువెలరీ షాపునకు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ యువతి తల్లితో కలిసి వచ్చింది. కేసీఆర్ 'ఏమిటమ్మా.. ఏం కొంటున్నావు' అని అడగడంతో పెండ్లికి నెక్లెస్ కొంటున్నానని చెప్పింది. మరి ఎందుకు ముభావంగా ఉన్నావని అడగడంతో ఆ యువతి ఏమీ చెప్పలేదు. 'నీ దగ్గరున్న నెక్లెస్ కంటే నా దగ్గరున్నది బాగుంది. ఇది తీసుకో అని' కేసీఆర్ అన్నారు. అది ధర ఎక్కువ సార్ అని యువతి అన్నది. ఆడపిల్ల పెండ్లి కోసం వారి కుటుంబసభ్యులు పడే ఇబ్బందులు బాగా తెలిసిన కేసీఆర్ పెద్ద మనసుతో స్పందించి, 'నా దగ్గర ఉన్న నెక్లెస్ తీసుకోమ్మా. దీని పైసలు మొత్తం నేనే ఇస్తా. నీ పెండ్లికి నా కానుక ఇది' అని యువతికి ఇచ్చారు. ఆ నెక్లెస్ ధర రూ.75 వేలు. ఆ మొత్తాన్ని కేసీఆర్ చెల్లించారు. జ్యువెలరీ షాపు నుంచి కేసీఆర్ బయటికి వస్తుంటే.. 'మీరు వచ్చిందే నిధుల సమీకరణకు, ఇప్పుడు యువతికి నెక్లెస్ కొనిచ్చారు ఎందుకు అని' జర్నలిస్టులు అడిగితే..'ఆ పిల్ల నా బిడ్డ లెక్క అనిపించిందయ్యా. ఇచ్చిన' అని తృప్తితో అక్కడి నుంచి ముందుకు సాగారు.



తండావాసుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కేసీఆర్ (ఫైల్)



2010లో రెడిన్ కలర్ ల్యాబ్‌లో కంప్యూటర్‌పై పనిచేస్తున్న కేసీఆర్

## భీమానాయక్ తండాలో కేసీఆర్ బస

నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న తరుణంలో ఏప్రిల్ 7, 2008లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని భీమానాయక్ తండాలో గుగులోత్ లక్ష్మి-భోజ్యా ఇంట్లో బస చేశాడు. ఆ దంపతులతో కలిసి జొన్నరొట్టెలు తిని రాత్రి బస చేశాడు. ఉదయం వేకువజామునే పండ్లపుల్ల వేసుకుని తండాలోని గడపగడప తిరుగుతూ గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంటపొలాల పరిస్థితి ఏంటి.. సాగునీరు సక్రమంగా ఉందా..? తండాలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి...? తదితర సమస్యలపై ఆరా తీశారు. అక్కడే షేవింగ్ చేసుకుని, స్నానం చేశారు. ఈ క్రమంలో తండాకు చెందిన గుగులోత్ అంబిలి-లింగా దంపతులు తమది నిరుపేద కుటుంబమని, బతుకుదెరువు కోసం హైదరా బాద్‌లో పనిచేసుకుంటున్నామని, తన కూతుళ్ల పెళ్లిళ్లు చేయడానికి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని కేసీఆర్ వద్ద మొరపెట్టుకున్నారు. వెంటనే రూ. 1.50 లక్షల ఆర్థిక సాయం చేస్తానని ప్రకటించారు. కల్యాణలక్ష్మి పథకానికి ఈ రెండు ఘటనలు కూడా ఒక కారణమై ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతుంటాయి. ఉద్యమ ప్రస్థానంలో జరిగిన ఘటనలతోనే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు రూపుదిద్దుకున్నాయి.





## జన నేతకు వృక్షార్చన

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, హరితహారం సృష్టికర్త కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పలువురు మాజీ ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు వృక్షార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హైదరాబాద్ హైదర్‌గూడలోని పార్కులో తన కుటుంబంతో కలిసి మొక్కలు నాటారు. చల్లా ధర్మారెడ్డి హనుమకొండలోని తన నివాసంలో, తాటికొండ రాజయ్య స్టేషన్ ఘన్‌పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత తన క్యాంప్ కార్యాలయంలో మొక్కలు నాటి నీరు పోశారు. సోమవారం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని కేసీఆర్ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటాలని, సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

*- నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 16*





# ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి



పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

- హాస్టల్ వార్డెన్, హెచ్‌ఎం నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- న్యాయం చేయాలని పాఠశాల ఎదుట ధర్నా



సోయం వినీత్ (ఫైల్)

వాజేడు, ఫిబ్రవరి 16 : ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు ఆశ్రమ బాలుర వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న సోయం వినీత్(13) శనివారం రాత్రి మృతి చెందగా, హాస్టల్ వార్డెన్, హెచ్‌ఎం నిర్లక్ష్యమే కారణమని ఆదివారం కుటుంబసభ్యులు ధర్నా చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పేరూరు గ్రామానికి చెందిన వినీత్‌కు జ్వరం రావడంతో శుక్రవారం ఇంటికి వచ్చాడు. శనివారం వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబసభ్యులు ధర్మవరం గ్రామంలోని ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించి, ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి వరకు తగ్గకపోగా, మళ్లీ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆర్‌ఎంపీ సూచన మేరకు ఏటూరునాగారం వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా హాస్టల్ నిర్వాహకులు తమకు తెలియజేయలేదని, ట్యాబ్లెట్ మాత్రమే వేయించి, పరిస్థితి చేయిదాటాక ఇంటికి పంపించారని వినీత్ కుటుంబసభ్యులు ఆరోపించారు. అధికారులు ఎవరూ ఘటనా స్థలం వద్దకు రాకుండా ఏటీడీఏ స్థాయి అధికారితో ఫోన్లో మాట్లాడించడంతో మృతుడి బంధువులు, ఏఎన్ఎస్, ఏఎస్పీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం, వార్డెన్‌లు కుటుంబానికి న్యాయం చేసేలా అధికారులతో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా మంత్రి సీతక్క విద్యార్థి కుటుంబ సభ్యులను ఫోన్‌లోనైనా పరామర్శించలేదని ఆదివాసీ నవ నిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నరసింహమూర్తి విమర్శించారు. ఐటీడీఏ అధికారులు విద్యార్థి మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు ఉయిక శంకర్ పాల్గొన్నారు.

## కోటలో విదేశీ కొంగలు



వరంగల్ కోటలోని చెరువు వద్ద సందడి చేస్తున్న విదేశీ కొంగలు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 16 : ఓరుగల్లు కోటలో విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా రాతికోట ఉత్తర ద్వారం సమీపంలోని చెరువులో ఆస్ట్రేలియాకు చెందిన పెయింటెడ్ స్టార్క్ కొంగలు కనిపిస్తున్నాయి. దేశీయ కొంగల కంటే రెండింతలు పెద్దవిగా, పొడుగాటి ముక్కు, ఎర్ర కాళ్లు, రెక్కలకు పింకు, బ్రౌన్ కలర్లతో చూడ ముచ్చటగా ఉన్నాయి. వీటికి తోడుగా బూడిద రంగులో ఉన్న సైబీరియా కొంగలు, దేశపు విహంగాలు ఆకట్టుకుంటున్నాయి. మొదటి సారి కోటలో రంగు రంగుల పక్షులు కనిపిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# కరువు సాగు

**వేసవికి ముందే నీటి కష్టాలు**

- ఎండిన మానేరు, చలివాగు, చెరువులు, బోర్లు
- బావుల్లో పూడికతీత పనులు ప్రారంభం
- యాసంగి పంటలపై సన్నగిల్లుతున్న ఆశలు
- కాళేశ్వరం ప్రాజెక్టును గుర్తు చేసుకుంటున్న రైతులు



ఎండిన మానేరులో రైతులు వేసుకున్న బోర్లు

**యాసంగి ప్రారంభంలోనే సాగు నీటి సమస్య మొదలైంది. మానేరు, చలివాగు, చెరువులు, బోర్లు ఎండిపోయాయి. కాల్వల ద్వారా నీరు రాక చాలా చోట్ల సాగునీటి కొరత ఏర్పడింది. దీంతో ముఖ్యంగా వరి, ఇతర పంటలు దెబ్బతినే పరిస్థితి దాపురించింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్లలో కనిపించని క్రేన్లను మళ్లీ తెస్తున్నారు. బావుల్లో పూడిక తీయడం, కొత్త బావులు తవ్వడం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని రైతులు కాళేశ్వరం ప్రాజెక్టును గుర్తు చేసుకుంటున్నారు. ప్రాజెక్టును ఎండబెట్టడం వల్లే ఈ పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

**- జయశంకర్ భూపాలపల్లి. ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ)**




టేకుమట్ల మండలం ఆరెపల్లి వద్ద బావి నుంచి తీస్తున్న పూడిక

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండడం, చెరువుల్లో నీటి మట్టం తగ్గడం.. బోర్లపై ఆశలు సన్నగిల్లడం.. మానేరు, చలివాగు ఎండిపోవడం తదితర కారణాలతో అన్నదాతల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా ఉపయోగించుకోలేని పాలకుల తీరుపై మండిపడుతున్నారు. ఫలితంగా జిల్లాలో మళ్లీ క్రేన్లు దర్శనమిస్తున్నాయి. చిట్యాల మండలం కైలాపూర్, టేకుమట్ల మండలం ఆరెపల్లిలోని వ్యవసాయ బావుల్లో రైతులు పూడికతీత పనులు ప్రారంభించారు. ఎండలు తీవ్రతరమైతే ఏప్రిల్, మే వరకు బోరు, బావుల్లో చుక్క నీరు ఉండే పరిస్థితి లేదు. దీంతో రైతులు కొత్త బావులు తవ్వేందుకు సిద్ధమవుతున్నారు. నిరుడు ఇదే సమయంలో ఇంతగా సాగు నీటి సమస్య తలెత్తలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టడంతో ఈ పరిస్థితి దాపురించిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు మూలంగా భూగర్భ జలాలు పెరిగాయని, బావులు, బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉండేవని గుర్తు చేసుకుంటున్నారు.

### నాటు దశలోనే కష్టాలు

జిల్లాలో చాలా వరకు వరి నాట్లు పూర్తయ్యాయి. చెరువులు, బావులు, బోర్లతో పాటు డీబీఎం-38, చలివాగు, మానేరు వాగుపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ యాసంగిలో 92,500 ఎకరాల్లో వరి, 19,500 ఎకరాల్లో మక్కజొన్న సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అయితే ఈ రెండు పంటలకు నీటి అవసరం ఎక్కువే. ప్రస్తుతం వరి, మక్కజొన్న సాగు ప్రారంభ దశలోనే ఉంది. ఈ పరిస్థితుల్లో నీటి ఎద్దడి ప్రారంభమైంది. భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందించలేకపోతున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 45 వేల ఎకరాలకు సాగునీరు అందించే డీబీఎం-38 కాలువలో చుక్క నీరు లేదు. కాల్వలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోడంతో మొగుళ్లపల్లి మండలంలో రైతులు సొంత డబ్బులతో పిచ్చి మొక్కలు తొలగించుకుంటున్నారు. చలివాగు, మానేరులో సైతం బోర్లు వేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. చిట్యాల, టేకుమట్ల మండలాల్లో రైతులు క్రేన్‌లు, జేసీబీల ద్వారా బావుల పూడికతీత పనులు ప్రారంభించారు. టేకుమట్ల మండలంలో రైతులు కొత్తగా బావులు తవ్వించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

### అరిగోసైతాంది



ఎన్నడూ లేని విధంగా కరువు వచ్చింది. ఎప్పుడూ మానేరులో నీళ్లు నిండుకుండలా ఉండేవి. ఈ సారి చుక్క నీరు లేదు. వరి పంట వేస్తే ఎండి పోతాంది. బావులు, బోర్లలో నీళ్లు మొత్తమే పడిపోయినయ్. ఏం చేయాలో తోచక పాత బావిని నేను, నా పక్క పొలం యజమాని భూమయ్య కలిసి పొత్తుల పూడిక తీపించుకుంటున్నం. ఖర్చు ఎక్కువ అవుతున్నా తప్పుతలేదు. లేకపోతే పంట ఎండుద్ది. ఇప్పుడు గిట్లుంటే వరి పంట ఈనే వరకు నీళ్లు అందకపోతే మా పరిస్థితి ఏంటి. తలుచుకుంటేనే భయమేస్తున్నది. *- కొండ వంశీ, రైతు, వెంకట్రావ్‌పల్లి, టేకుమట్ల మండలం*

### బావిలో నీళ్లు ఎల్లతలేవు ..



నాకున్న ఐదు ఎకరాల్లో మిర్చి పంట వేసిన. మొన్నటి దాక నీళ్లకు ఇబ్బంది కాలే. ఇప్పుడు నీళ్లు అందుతలేవు. రెండు ఎకరాలకు కూడా నీళ్లు ఎల్లతలేవు. మిర్చి చేతికి వచ్చే టైంల నీళ్లు లేక పోవడంతో ఏం తోత్తలేదు. పూడిక తీస్తే బావిల నీళ్లు పడుతయని తీపిస్తున్న. అయినా నీళ్లు రాకపోతే పంట పోయినట్లే. గతంలో ఎప్పుడూ ఇంత గోస రాలే. బోర్లు కూడా ఎండిపోతున్నయ్. వాగులల్ల నీళ్లుంటే బావులు, బోర్లలో నీళ్లుండేటియి.

*- వేముల ఓదెలు. కైలాపూర్, చిట్యాల మండలం*

### కాళేశ్వరమే శరణ్యం

కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే సాగునీటి కష్టాల నుంచి కాపాడుతుందని రైతులు గుర్తించారు. కేసీఆర్ పాలనలో ఏనాడూ సాగునీటి కష్టాలు రాలేదని, ప్రాజెక్టును పక్కన పెట్టిన నాటి నుంచే నీటి ఎద్దడి తీవ్రమైందని వాపోతున్నారు. అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేయడంతో మానేరు, చలివాగులు ఎప్పుడూ నిండుకుండల్లా ఉండేవని, బోర్లు, బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉండేవని గుర్తు చేసుకుంటున్నారు. నాటు దశలోనే ఈ పరిస్థితి ఉంటే పంట చేతికొచ్చేదాక పంటలను బతికించుకునేదెలా అని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమీపంలో ఉన్న చెరువులు సైతం నీరు లేక నెర్రలు బారడం గమనార్హం.

# పెద్దపులి జాడేది ?



పులి కోసం అడవిలో గాలిస్తున్న అటవీ సిబ్బంది

- గాలింపు చర్యలు చేపట్టిన అటవీ శాఖ సిబ్బంది
- అక్కడక్కడా ప్రత్యేకంగా ట్రాప్ కెమెరాలు
- భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు

మహదేవపూర్(కాళేశ్వరం)/కాటారం, ఫిబ్రవరి 16 : మహదేవపూర్ మండలంలోని బీరసాగర్, అన్నారం అడవుల్లో, కాటారం మండలం గుండ్రాత్‌పల్లి గ్రామ శివారులో పులి సంచరిస్తున్నదనే సమాచారంతో అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా దాని జాడ తెలియడం లేదు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఆదివారం పులి ఆచూకీ కోసం అన్నారం, బీరసాగర్ అటవీ క్షేత్రాల్లో అటవీ శాఖ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా ట్రాప్ కెమెరాలను సైతం అక్కడక్కడా ఏర్పాటు చేశారు. అదిలాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక యానిమల్ ట్రాకింగ్ టీం సభ్యులు పులి ఫగ్ మార్క్‌లను పరిశోధిస్తున్నారని అధికారులు తెలిపారు. సమీప గ్రామాల పశువుల కాపరులు, ప్రజలు అడవుల్లోకి వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. పులి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా గుండ్రాత్‌పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పలువురు పెద్దపులి జాడలను చూసి భయంతో వెనక్కి తిరిగి వచ్చి చెప్పడంతో అటవీ శాఖ అధికారులు దాని అడుగులను పరిశీలించారు.



అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు





